**కథ**

# కముకుదెబ్బ

''సునీతా! సునీతా!'' రొప్పుకుంటూ పరిగెట్టి సునీతను ఆపింది కళ్యాణి. చకచకా నడుస్తున్న సునీత ఒక భారీకాయం తన బరువు తన మీద వేసేసరికి తూలిపడబోయి నిలదొక్కుకుంది.

''అబ్బ! ఇంకా ఆ కాలేజీ సునీతలాగే సన్నగా ఉన్నావోయ్ నాజూగ్గా. నేను చూడు ఎలా రుబ్బురోలులా అయ్యానో! రోడ్డని మరిచి బిగ్గరగా మాట్లాడేస్తున్న కళ్యాణి నాపింది సునీత.

''పద. మా ఇల్లు ఇక్కడికిదగ్గరే!''

''కొంచెం ఐస్ సోడా తాగిపోదామే!''

''ఊహూం హాయిగా ఇంటికెళ్ళి చల్లటి మంచి నీళ్ళు తాగుదాం. పద.''

''ఓసి! పిసినారీ! చేతిలో చక్కటి పర్సు పెట్టుకొని నీకిదేంబుద్ధే!'' అంటూనే సునీతను అనుసరించింది.

పర్సులోంచి తాళం చెవి తీసి తలుపులు బార్లా తెరచి పెరట్లో ఉన్న గాబులోంచి నాలుగు చెంబుల నీళ్ళు తీసుకుని కాళ్ళూ చేతులూ, ముఖం కడుక్కుంది సునీత.

''ఊఁ నువ్వు కూడా కాళ్ళు కడుక్కో..''

కళ్యాణి అన్యమనస్కంగానే కాళ్ళు కడుక్కుని లోపలికి వచ్చింది. మూలనున్న చాపపరచి ''నీ ఇష్టం. కుర్చీలో కూర్చుంటే అదిగో కుర్చీ, నేను మాత్రం క్రిందేనూ.'' అంటూనే కళ్యాణికి కుండలో మంచినీళ్ళిచ్చి చాపమీద నడుం వాల్చింది.

కళ్యాణి ఆశ్చర్యంగా ఇంటినే చూస్తోంది.

రెండు గదుల రేకులషెడ్డు. ఒక పాతచెక్క కుర్చీ, ఒక టేబుల్, చిన్న రేడియో, రెండు చాపలు... ఇలా చిన్న చిన్న సామాను. పరాయి ఊళ్ళో పనిమీద ఒక నెల్లాళ్ళు అద్దెకుండడానికి తీసుకున్న గదులులాగ ఉన్నాయి. అంతా ఖాళీయే. టూ బెడ్‌రూమ్ హౌస్ కాదు. ఎటాచ్డ్ బాత్ రూమ్స్ లేవు. కనీసం ఇల్లు పక్కాగాలేదు. డబుల్ కాట్ లేదు. టి.వి లేదు. టేప్ రికార్డర్ లేదు. ఫ్రిజ్ లేదు. వి.సి.పి. లేదు. ఇదేమిటి ఇల్లు ఇలా ఉంది?

కళ్యాణి ఆశ్చర్యానికి కళ్యాణినొదిలేసి సునీత కళ్ళు మూసుకొని వెల్లకిలా పడుకుంది. కళ్యాణి ఇల్లంతా కలియచూసింది పెరట్లోకి వెళ్ళివచ్చింది. పెరట్లో వేపచెట్టు కొమ్మలు రేకులపై వాలి కొంచెం చల్లదనాన్నిస్తున్నాయి. లేకపోతే ఈ మార్చిలోనా? ఈ ఇంట్లోనా? అనుకుంది.

''సునీ! అనుకోకుండా కనిపించావుకాని ఎన్నేళ్ళయిందే నిన్ను కలుసుకుని. నువ్వేదో ఉద్యోగం చేస్తున్నావన్నారు మీ నాన్నగారు కనబడి. మీవారేరి? ఏం చేస్తున్నారు?''

''నేను ఒక ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేస్తున్నాను. మావారు ఒక ప్రైవేటు కాలేజీలో లెక్చరర్.''

''మరి.. మరి..'' అంటూ ఎలా అడగాలో తెలియక సునీత పడేసిన పర్సు తీసి చూసింది. రెండు పెన్నులు, ఒక రుమాలు, రెండు చాక్లెట్లు తప్ప ఏమీలేవు.

''ఏమిటే నీ ధర్మసందేహం?''

''ఇల్లు ఇలా అయ్యవారి నట్టిల్లులా ఉందేమే'' చటుక్కున అనేసింది. ''ఇద్దరు సంపాదిస్తున్నారు. ఏమీలేవు.''

''నువ్వే అన్నావుగా అయ్యవారి నట్టిల్లని. నిజంగానే ఆయన అయ్యవారు. నేను అమ్మవార్ని...'' తేలికగా అంది సునీత.

''అది సరేగాని నువ్వేం చేస్తున్నావు?'' అంది మళ్ళీ ఆరాగా.

''నేను ఉద్యోగం చెయ్యడంలేదు. మావారు డి.ఇ.వో ఆఫీసులో క్లర్కు. జీతం ఫరవాలేదు. నేను చెయ్యకపోయినా గడుస్తుంది. ఇద్దరు పిల్లలు. 'శుద్ధోదన'లో చదువుతున్నారు.''

''శుద్ధోదనలోనా? ఏ క్లాసు? పేర్లు..''

''అమ్మాయి పేరు సౌమ్య. సెవెంత్, అబ్బాయి భరత్ ఫిఫ్త్.''

''వాళ్ళు మీ పిల్లలా! మా స్కూలేనా.''

''ఏమిటీ? నువ్వు శుద్ధోదనలోనా పనిచేసేది.''

''ఊఁ''

''ఎంతిస్తార్!''

''నాలుగొందలు!''

''ఏమిటీ!'' అరచినంత పని చేసింది కళ్యాణి.

''ఆ బిల్డింగు, ఆ గార్డెన్, ఆఫీజులూ. ఆ ఖరీదైన స్కూల్లో నీ జీతం నాలుగొందలా! మీ డైరెక్టరు కారులో వస్తూంటాడుకదే!''

''ఊఁ''

''ఆయన కూడా బి.ఎస్.సి. చదివాడంతేట కదా!''

''ఊఁ''

''మీ స్కూల్లో క్లాసు రూముల్లో కుర్చీలుండవటగదా!''

''ఊఁ''

''నిన్ను తగలెయ్య! అన్నిటికీ ఊఁ ఊఁ అంటావేమిటే.'' ఉడుక్కుంది కళ్యాణి.

''ఏమనమంటావ్! నువ్వు చెప్పేవన్నీ నిజమే. మా డైరెక్టరు మారుతీ కార్లో వస్తాడు. ఆయన చదివింది బి.ఎస్.సి. అంతే. మా క్లాసు రూముల్లో కుర్చీలుండవు. టీచర్లు కుర్చీలో కూర్చొని పాఠం చెప్పకూడదు. కుర్చీలుంటే పొరపాటున కూర్చుంటారని కుర్చీలే లేకుండా చేసాడు.

ఆయన ఏం చదువుకుంటేనేం. ఇంకానయం. మా డైరెక్టరు బి.యస్.సి. అయినా చదివాడు. ఐదవ క్లాసు చదివీ బ్రహ్మాండమైన ఇంగ్లీషు మీడియమ్ కాన్వెంట్లే రన్ చేస్తున్నారు తెలుసా!

డబ్బు లెక్కలు వస్తే చాలు. మనలాంటి పిచ్చాళ్ళు ఉంటారుగా. ఇది ఒక వ్యాపార సంస్థ. వాళ్ళెంత ఇచ్చినా దీనికి మంచి పేరు ఉంది. మంచి టీచర్లున్నారు. వీళ్ళకెంత చదువున్నా డబ్బులేదు. ఆయనకు అది ఉంది. కనుకే జీహుజూర్ ఎస్సార్ అంటాం.''

''ఏ టీచరైనా పొరపాటున కసిరినా దెబ్బలాడేదానివి. నువ్వేనా ఇలా అంటున్నావు?''

''అంతే! ఇది బ్రతుకు పోరాటం. మా బాస్ ఇంకా మంచివాడనే చెప్పొచ్చు. ట్యూషన్లు చెప్పుకోనిస్తాడు. లేకపోతే ఎలా బ్రతుకుతున్నామనుకున్నావు?''

''మరి మీ వారు..''

''అదొక సొలెగూడు. అన్ ఎయిడెడ్ పోస్టులో చేస్తున్నారు. అదీ నలభై వేలు పెట్టి కొనుక్కున్నారు. దానికి బాంకువాళ్ళ వడ్డీలా నాలుగు వందల జీతం. అదీ మేనేజిమెంటు చిత్తం వచ్చినప్పుడు.''


''మరి వాళ్ళ మేనేజిమెంటు మంచితనం గురించి చెప్పు..'' వెక్కిరింతగా అంది కళ్యాణి.

''వాళ్ళూమంచివాళ్ళే. వాళ్ళు సమ్మర్‌లో జీతం కూడా ఇస్తారు.''

''అంటే మీవాళ్ళు..''

''మేనెలలో కట్. 'నోవర్క్, నోపే' పాలసీ మావాళ్ళది. కాని దసరా సెలవులకి, సంక్రాంతి సెలవులకి జీతం కట్ చెయ్యరు తెలుసా! స్కూలు నడిపేవాడికి చదువురానక్కర్లేదు. నర్సింగ్ హోం నడిపేవాడికి వైద్యం రానక్కర్లేదు. స్పెషలిస్టులు వస్తారు. ఫీజు వసూలు చేసుకుని ట్రీట్‌మెంటిచ్చిపోతారు. బెడ్ రెంటు, బాత్‌రూమ్ రెంటు, సెలైన్ స్టాండు రెంటూ అంతా డబ్బే. సరేలే! టీ పెడతాను. పది నిముషాలు కూర్చో..'' అంటూ సునీత లేచింది.

''నేనూ వస్తాను పద.''



''వద్దులే! టీ స్టౌమీద పడేసివస్తాను. ఒక్క నిమిషం.'' సునీత లోపలికి ెళ్ళిపోయింది.

మాగన్ను పట్టింది కళ్యా ణికి.

''టీ రెడీ డియర్! నా చిన్నిగృహంలో చిన్న ఆతిథ్యం.'' అంటూ సునీ టీ అందించింది.

''ఊఁ ఏలక్కాయ కూ వేసావే!''

''ఏలక్కాయ వేయలేద ఏలక్కాయ తొక్క వేసాను. ఏలక్కాయ వాడిన ుడల్లా తొక్కలు వేరే సీసాలో పడేస్తాను. నీలాంటి అతిథులు వచ్చినప్పుడల్లా ఘుమఘుమలాడే టీ స్తాను.''

''అవును మన క్లాస్‌మే ్ వరలక్ష్మి స్త్రీవాద కవిత్వం వ్రాస్తోంది తెలుసా క్రాంతి కలం పేరు పెట్టుకొని వ్రాసేది మన వర ్క్ష్మి.

''ఊఁ..'' కళ్యాణి మ ట పూర్తి కాకుండానే వెంకట్రావు వచ్చాడు.

''మావారు, మా ఫ్రెండ్ కళ్యాణి. బి.ఎస్.సి.లో నా క్లాస్‌మేట్'' ముభావంగానే 'నమస్తే' అనేసి లోపలికి వెళ్ళిపోయాడు.

అతను లోపలికెళ్ళేదాకా బలవంతంగా ఆపుకుని ఫకాల్న నవ్వింది కళ్యాణి. సునీత ప్రశ్నార్థకంగా చూసింది.

''మావారు.. నవారు'' అంటూ మళ్ళీ మళ్ళీ నవ్వింది కళ్యాణి కళ్ళవెంట నీళ్ళొచ్చేలా. సునీతకు కూడా గుర్తొచ్చి చిన్నగా నవ్వింది. చదువుకునే రోజుల్లో ఎవరైనా మావారు అంటే సునీతకు

**జి. మహీధర**

చచ్చేంత కోపమొచ్చేది. చక్కగా పేరుపెట్టి పిలి చ్చుగా మావారుట మావారు నవారులా అని తిట్టేది. అది గుర్తొచ్చి సునీత మావారు అని పరిచయం చెయ్యగా కళ్యాణికి నవ్వొచ్చింది.

సునీత చిన్నగా కళ్యాణి తలమీద కొట్టింది ''ఏమీ మర్చిపోలేదు'' అంటూ.

''వస్తానేఁ'' అంటూ కళ్యాణి వెళ్ళిపోయింది.

సునీత లోపలికి వచ్చింది. వంటింట్లో కటిక నేలమీద మూడంకె వేసుకుని పడుకున్నాడు వెంకట్రావు.

''ఏమిటలా ఉన్నారు?''

''ఏం లేదు'' తలెత్తకుండానే అన్నాడు.

''ఏం లేకపోవటమేంటి? ఏదో వుంది.'' బల వంతంగా అతని తల ఎత్తుతూ అంది.

''నన్ను విసిగించకు వెళ్ళు). కసురుకున్నాడు.

''మీరేం చెప్పక్కర్లేదు. జీతంకోసం మీ కరస్పాండెంటు దగ్గరికి వెళ్ళి ఉంటారు. నుంచోబెట్టి, నుంచోబెట్టి రిజల్టు బాగా రానందుకు నాలుగు చివాట్లెట్టి పంపి ఉంటాడు.''

అలవోకగా అంటున్న సునీత మాటలకి వెంకట్రావుకి ఒళ్ళు మండిపోయింది. సునీతని వంగదీసి నాలుగు బాదాలనుకున్నాడు.

'రాక్షసి' లోపల్లోపలే గొణుక్కున్నాడు.

''చూడండి. మీరు నన్నేమనుకున్నా బాధేం లేదు. కాని కాళ్ళు ముఖం కడుక్కురండి. నాకు ఆకలి దంచేస్తోంది.''

మారు మాట్లాడకుండా భోజనాలు చేస్తారు. సునీత గిన్నెలు కడుగుతూంటే అటే చూస్తూ కూర్చున్నాడు వెంకట్రావు. యాంత్రికంగా, ప్రణాళికగా సునీత ఎలా ఉంటుంది? తనెందుకు ఉండలేడు? అనుకున్నాడు.

సునీత వచ్చి వెంకట్రావు పక్కన కూర్చొంది చెప్పండంటూ.

''సునీతా! నిన్నొకటి అడుగనా! ఏమనుకోకూడదు.''

''అడగండి.''

''నువ్వు ఎబార్షన్ చేయించుకోకూడదూ. ఇంకా రెండు నిండలేదుగా!'' తలవంచుకొని అన్నాడు.

''ఎందుకు?'' సూటిగా, నిబ్బరంగా అడిగింది.

''దరిద్రానికి తోడు బరువు పంచుకోలేను.''

''చూడండి. బరువు మీరొక్కరే మోయనక్కర్లేదు. నేనున్నాను పంచుకోడానికి. ఒక్కళ్ళతో ఆపేద్దాం. అవును, పేపరు తెచ్చారా!''

''ఊం''

అతని చేతి సంచీ తీసి పేపరు తీసింది. షేర్ల రేటు చూసింది.

''ఏం పెరగలేదు. ఇంకా తగ్గేయి.'' కళ్ళు మూసుకుని చెప్పాడు.

''పోన్లే! మనకి లాభం వచ్చిన డబ్బు పెట్టాం కాని అసలు పెట్టుబడిలోది కాదుగా. లాభం తగ్గింది.'' తేలికగా అనేసింది.

సునీత అంత తేలికగా ఎలా బతికేస్తుంది. ఏమయినా అంటే వస్తు సంస్కృతి తెచ్చిన వ్యామోహం కాకపోతే బ్రతకడం కష్టం కాదంటుంది. ఎంత ఆత్మ విశ్వాసమో అనుకున్నాడు. నవ్వూ, ఏడుపూ కలగాపులగా వచ్చాయి వెంకట్రావుకి.

''మీకు గ్రాంట్సు లేవని బాధపడుతున్నారుకాని గ్రాంట్సున్నవాళ్ళకి మాత్రం జీతాలొస్తున్నాయా! ప్రభుత్వం దగ్గర డబ్బు లేదుగా! పాపం..'' కళ్ళు తిప్పుతూ నాలిక తాటించింది.

''అరకులోయలో విలువైన రాళ్ళు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. గ్రానైటు స్టోన్సు కోసం నాయకులందరూ పాపం పార్టీరహితంగా పోటీపడుతున్నారు. పాపం వాళ్ళకి చేతినిండా పని.. మనలాంటి వాళ్ళకోసం ఆలోచించడానికి టైమేది?'' అంటూనే పేపరు తిరగేసింది.

''ఫలానా గ్రామంలో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం. నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి తేదీ అయిన నిన్న బరిలోవున్న ఇద్దర్లూ ఉపసంహరణ.. ప్రజలలో ఎంత ఐకమత్యం పెరిగిందో..''

మధ్య మధ్య వ్యాఖ్యానిస్తూ పేపరు పైకి చదువుతున్న సునీతను చూస్తుంటే ఒళ్ళు మండిపోయింది.

''చాలుం ఆపు నీ గోల..'' కసురుకున్నాడు.

''పాలిటిక్స్‌లో పి.జి. చేసారుకాని తెలివి లేదండీ మీకు. చదువుకోకపోయినా, పల్లెటూరి వాళ్ళయినా వాళ్ళని చూడండి డిపాజిట్ కట్టారు, నామినేషన్ వేసారు. విత్‌డ్రా చేసుకోవడానికి బేరం పెట్టారు. కష్టపడకుండానే పదో, ఇరవైయ్యో వాళ్ళ రేటు బట్టి బేరం కుదుర్చుకున్నారు. దటీజ్ పాలిటిక్స్.

ప్లేటో ఏమన్నాడు? అరిస్టాటిల్ ఏమన్నాడు? ఆఫ్ ది పీపుల్, బైది పీపుల్, ఫర్ ది పీపుల్... ఎన్నిసార్లు చెప్పినా, ఎంతకాలం చెప్పినా ఉపయోగంలేని పాటే కదా!..''

ఉపన్యాస ధోరణిలో సాగిపోతోంది సునీత.

''అందుకే ముఖ్యమంత్రిగారు చరిత్రలు, రాజకీయ శాస్త్రాలు చదవనక్కర్లేదు. ఈ గ్రూపులు కాలేజీలో ఉండక్కర్లేదని రద్దుచేసేసారు. ఇంక లెక్చరర్లెందుకు? దిక్కుమాలిన చదువైపోయింది. ఇంత కష్టం వ్యర్థమైపోయింది.'' అంటూ విసురుగా చేతిలో పేపరు లాగి చించి పడేసాడు.

''సునీతా! రిజల్టు రాలేదంటాడు. మాకు వచ్చేదంతా ముదురు సరుకు. నాలుగుసార్లు తప్పి, కంపార్టుమెంటుగా పాసయినవాళ్ళు- ఎంత కష్టపడ్డా ఫలితం లేదు. ఏం చెయ్యను?'' దిగాలుగా అన్నాడు. ''చచ్చిపోదామనిపిస్తుంది సునీతా! జీతంకోసం జీవితాన్ని అమ్మేసుకున్నానా? అనిపిస్తుంది. ఆత్మని చంపేసుకున్నాను. చూడనట్టు ఎంతసేపు నుంచోబెట్టాడని. కుర్చీలాక్కొని కూచుందాము అనిపించింది. మనం స్టూడెంట్లను కూడా అలా నుంచోబెట్టం. జీవితంలో ఎక్కడ తప్పుచేసాం? ఇలా ఎందుకు ఎన్నుకున్నాం? ఆ నలభై వేలూ వాడికిచ్చే బదులు కిళ్ళీకొట్టు పెట్టుకున్నా బాగుండేది. గ్రాంట్సురావు. వాడికిచ్చిన డబ్బు వెనక్కురాదు. పిచ్చెక్కిపోతోంది.''

వెంకట్రావు కళ్ళెర్రబడిపోయాయి.

''ఎం.పి.సి., బై.పి.సి. ఎ స్క్వేర్ + బి స్క్వేర్.. ఇంతకంటే జనానికి ఏం అక్కర్లేదు. చరిత్ర పునరావృతమవుతుంది. మనిషి ఎటువంటి అవరోధాలను దాటి ఈ స్థితికి వచ్చాడో, జీవితం ఎంత పోరాటమో మర్చిపోయారు. ప్రజలను డాలర్ల భ్రాంతిలో ఎలా ముంచాలా? అను ప్రణాళికలు, విప్లవాలు, జీవన్మరణ పోరాటాలూ.. జాతిని జీవింపచేసే చదువులు ఏమీ అక్కర్లేదు.''

ఒక్కక్షణం సునీత బిత్తరపోయింది. మరుక్షణం ''కూల్ డౌన్, కూల్ డౌన్'' అంటూ దగ్గరకు లాక్కుంది.

చాలాసేపు అతని తల నిమురుతూ ఉండిపోయింది.

''చూడండి, మనం మధ్యతరగతి వాళ్ళం. మన చదువు, మన తెలివీ అన్నీ మధ్యతరగతివే. కూలీ నాలీ చేసుకునేవాళ్ళలాగా ఏపూట బ్రతుకు ఆపూటది అన్నట్లు ఉండలేము. కొంత భయం, కొంత మిథ్యాగౌరవం, ఎవరైనా ఏదైనా అనుకుంటారేమోననే సంకోచం, ఎవరూ గౌరవించరేమోననే అనుమానం, అవమానాల్ని దులుపుకోలేని మన స్తత్వం... అన్నిరకాల కాంప్లెక్స్‌లతో బ్రతుకుతాం. కడుపు కాల్తున్నా చేయి చాచలేం. చాచి కొట్టలేం. మన తోటివాళ్ళ స్థాయిలో కాకపోయినా, కన్నీళ్ళని వెనకాలే దాచేద్దాం. చేతనయింత పొదుపుగా, జాగ్రత్తగా బ్రతుకుదాం. మనకంటే లేనివాళ్ళు ఎంతమందిలేరు!

చీమల్లాగా జాగ్రత్తగా బ్రతుకుదాం. రాజీపడుతూ బ్రతుకుదాం. ఇంకా జీవితం మొదటి అడుగులోనే ఉన్నాం. ఇప్పుడే బెంబేలెత్తితే ఎలా? చూద్దాం. జీవితాన్ని మనం నడపలేనప్పుడు, జీవితమే మనల్ని నడుపుతుంది.''

సునీత వెంకట్రావు తల నిమురుతూ ఉండిపోయింది.

★

